ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక


పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు ప్రభాత ఉదయం విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు
ఎడిటర్ &
మేనేజింగ్ డైరెక్టర్
ఎం.దామోదర్ రెడ్డి

సంపుటి: 2 | సంచిక: 352 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 30 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## ప్రజా అవసరాలకు
# అనుగుణంగా లింక్ రోడ్లు

### భవిష్యత్తులో అవసరాలకు తగ్గట్లు రోడ్ల విస్తరణ
### అవసరమైతే కొత్త రోడ్లు నిర్మించాలి: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 29 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, ప్రజలు ఎటువంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో విశాల ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సీఎం అన్నారు. అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

### రవీంద్రభారతిలో
## పంచాంగ శ్రవణం

ఉగాది పురస్కారాలు అందచేయనున్న ప్రభుత్వం
ఉగాది శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి




2



## ఛత్తీస్‌గఢ్‌లో
# భారీ ఎన్‌కౌంటర్
### 17 మంది నక్సల్ హతం!

**సుక్మా, మార్చి 29 (ప్రభాత ఉదయం):** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో 11మంది మహిళలు సహా రూ.25లక్షల రివార్డు ఉన్న ఒక వ్యక్తి ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డట్లు చెప్పారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.అంతకుముందు, సుక్మాలో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా సంస్థలు 16 మంది నక్సలైట్లను మట్టుబెట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్ మాధ్యమంలో పోస్ట్ చేశారు. ఆయుధాలు మార్పును తీసుకురాలేవని, కేవలం శాంతి, అభివృద్ధితోనే మార్పు సాధ్యమని హితవు పలికారు. అనంతరం మరో నక్సలైట్ కూడా మృతిచెందినట్లు అధికారులు అప్డేట్ ఇచ్చారు. స్థానిక గోగుండా కొండపై మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో శుక్రవారం పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. శనివారం ఉదయం కూడా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుండగా కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఈ క్రమంలోనే ఎదురుకాల్పులు జరిపిన పోలీసులు 16 మందిని ..మిగతా 2లో

## మయన్మార్‌లో
# వరుస భూకంపాలు



### భూ ప్రకంపనలతో వణికిపోతున్న జనాలు
### ఇప్పటికే వేయి దాటిన మృతుల సంఖ్య
### భారత్ సాయం అందచేత...ఆపరేషన్ బ్రహ్మాగా నామకరణం


**న్యూఢిల్లీ, మార్చి 29 (ప్రభాత ఉదయం):** మయన్మార్, థాయ్‌లాండ్‌లో సంభవించిన భూకంపం తీవ్ర విషాదాన్ని మిగలల్చింది. మయన్మార్‌లో మరోమారు శనివారం భూకంపం సంభవించడంతో ప్రజలు వణికిపోయారు. ఇప్పటి వరకు భూకంపంతో 1600మందికి పైగా మృతి చెందినట్లు తెలుస్తోంది. మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలను శుక్రవారం రెండు అత్యంత ..మిగతా 2లో

# అర్ధరాత్రి వరకు మెట్రో సర్వీసులు



**హైదరాబాద్, మార్చి 29 (ప్రభాత ఉదయం):** మెట్రో రైలు ప్రయాణ వేళలు మారాయి. రాత్రి11.45గంటల వరకు రైళ్లు నడపాలని నిర్ణియంచారు. ఈ మేరకు ప్రయాణికులకు మెట్రో ఎండీ ఎన్‌విఎస్ రెడ్డి శుభవార్త అందించారు. ఇప్పటివరకూ మెట్రో నడిచే సమయాన్ని పొడిగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఆఖరి రైలు రాత్రి 11 గంటల వరకే అందుబాటులో ఉంటుందనే విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సమయాన్ని రాత్రి 11.45 గంటల వరకూ పొడిగిస్తున్నట్లు- ఎన్‌విఎస్ రెడ్డి ప్రకటించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులో ఉండనున్నట్లు వెల్లడించారు. అయితే ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకే ఈ సమయ వేళలు అమలులో ఉండనున్నాయి. అంతేకాక ప్రస్తుతం విద్యార్థులకు ఇస్తున్న సూపర్ సేవర్ హాలిడే ఆఫర్ మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు 20 ట్రిప్పుల డబ్బులతో 30 ట్రిప్పులు వెళ్లే ఆఫర్‌ను మరో ఏడాది పొడిగించారు.


### ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు
# వెసులుబాటు
### 31న పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు




**హైదరాబాద్, మార్చి 29 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో మార్చి 31న రంజాన్ సెలవుగా ప్రకటించినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఎల్ఆర్ఎస్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోనే నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చుని ..మిగతా 2లో

## బీసీ బిల్లుల స్థితిపై
# ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

### కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత బీజేపీది
### కులసర్వేలో అక్రమాలు, నిజమైన గణాంకాలను బయటపెట్టాలి
### రిజర్వేషన్ల పెంపునకు బీఆర్ఎస్ పోరాటం : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, మార్చి 29 (ప్రభాత ఉదయం):** తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో కామారెడ్డిలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీల హక్కులు, రిజర్వేషన్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బీసీ బిల్లుల స్థితిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ఆమోదించేందుకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఏమి చేస్తున్నాయో సమాధానం చెప్పాలన్నారు. బీసీ బిల్లులను ఆమోదింపజేయడానికి కేంద్రంలో అధికారంలో ..మిగతా 2లో



## రెండురోజుల్లో
# రైతు భరోసా నిధులు జమ
### ఖమ్మంలో వ్యవసాయ మంత్రి తుమ్మల వెల్లడి

**ఖమ్మం, మార్చి 29 (ప్రభాత ఉదయం):** మరో రెండు రోజుల్లో రైతు భరోసా నిధులు 90 శాతం మంది రైతుల ఖాతాల్లో జమ అవుతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు. శనివారం మంత్రి ఖమ్మంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల వ్యవసాయ భూములు పరిశీలించడం జరుగుతుందని, అవి మినహా మిగతా వ్యవసాయ భూములకు రైతుబంధు ..మిగతా 2లో



## సమతా నగర్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి

### కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 29 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్ లో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ స్థానిక సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి శనివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా సమతానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసుకుని కమ్యూనిటీ హాల్ ను కాలనీవాసులకు అందుబాటులో తీసుకువస్తామని కార్పొరేటర్ సతీష్ గౌడ్ తెలిపారు. అదేవిధంగా కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదని, వాటి సమస్యతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత విద్యుత్ అధికారులతో చర్చించి అతి త్వరలో విద్యుత్ సమస్యను పరిష్కరించి మూడు స్తంభాలను కూడా వేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమతా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నర్సింలు, సతీష్ గౌడ్, కేబీఎన్, నారాయణ, ఇ.లింగస్వామి, కె. యాదగిరి, యు. వెంకటేష్, కె. భాస్కరరావు, పి.సుకృత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మొదటి పేజీ తరువాయి...

హతమార్చారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇరువర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

### ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు స్వాధీనం

ఘటనాస్థలం నుంచి 16 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఘటనాస్థలంలో ఏకే-47 రైఫిల్, సెల్ఫ్-లోడింగ్ రైఫిల్, ఇన్సాస్ రైఫిల్, పాయింట్ 303 రైఫిల్, రాకెట్ లాంచర్, బారెల్ గ్రెనేడ్ లాంచర్, పేలుడు పదార్థాలతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించాలని నిశ్చయించుకున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. సుక్మాలో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు 16 మంది నక్సలైట్లను మట్టుబెట్టాయని ఎక్స్ మాధ్యమంలో పోస్ట్ చేశారు. అడవుల్లో ఆయుధాలతో ఉన్నవారికి విజ్ఞప్తి చేసిన అమిత్ షా ఆయుధాలు మార్పును తీసుకురాలేవని పేర్కొన్నారు. కేవలం శాంతి, అభివృద్ధితోనే మార్పు సాధ్యమని హితవు పలికారు.

### మూడ నెలల్లో 130మందికి పైగా

మావోయిస్టులు లేని దేశంగా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన తర్వాతే ఛత్తీస్‌గఢ్‌లో యాంటీ నక్సలిజం ఆపరేషన్స్ ముమ్మరంగా జరుగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోనే ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో 132 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇక తాజాగా ఎన్‌కౌంటర్ ఈ ఏడాదిలోనే జరిగిన జరిగిన మూడో భారీ ఆపరేషన్.

## రవీంద్రభారతిలో పంచాంగ శ్రవణం

హైదరాబాద్, మార్చి 29 (ప్రభాత ఉదయం): విశ్వావసు ఉగాది వేడుకలు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పదిగంటలకు రవీంద్రభారతిలో జరగనున్నాయి. ఈ మేరకు సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేసింది. పంచాంగ శ్రవణంతో పాటు, ఉగాది పురస్కారాలను సిఎం రేవంత్ రెడ్డి అందచేయనున్నారు. వివిధ రంగాలకు చెందిన వారికి ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించింది. ఉగాది వేడుకల నిర్వహణ గురించి వివిధ శాఖల



అధికారులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి శైలజ రామయ్యర్ చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ రేవంత్ రెడ్డి, గౌరవ మంత్రివర్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారి , ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి పంపిణీ, పంచాగ శ్రవణం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.. ఇదిలావుంటే ఉగాదిని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. సిఎం రేంవత్ రెడ్డి సహా మంత్రులు, ఇతర నాయకులు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విపక్షనేత మాజీ సిఎం కెసిఆర్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు వెసలుబాటు

మొదటి పేజీ తరువాయి...

సూచించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని వెల్లడించింది.ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం ఎల్‌ఆర్‌ఎస్ అమల్లో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులోనూ 25శాతం రాయితీ ఇవ్వనుంది. ఈ నెల30, 31 ఉగాది, రంజాన్ సెలవు దినాలు కావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపునకు 31న కూడా అవకాశం కల్పించాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం స్పందించింది. 31న బ్యాంకులు కూడా పనిచేయనున్న నేపథ్యంలో ఆ రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. ఎల్‌ఆర్‌ఎస్ కోసం 25,67,107 మంది దరఖాస్తు చేసుకోగా.. మార్చి 28 వరకు 3,25,538 మంది ఫీజు చెల్లించినట్లు పురపాలక పేర్కొంది. ఈ క్రమంలోనే తాజాగా మరో 20,00,493 మందికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని పురపాలక శాఖ లేఖలు రాసింది. దీంతో 31న రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

# మయన్మార్‌లో వరుస భూకంపాలు

మొదటి పేజీ తరువాయి...

శక్తిమంతమైన భూకంపాలు కుదిపేసిన విషయం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే చోటు చేసుకున్న భూ ప్రకంపనలతో మయన్మార్, థాయ్ దేశాలు వణికిపోయాయి. రోడ్లు, వంతెనలు, ఎయిర్‌పోర్ట్‌లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ విపత్తులో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ముఖ్యంగా మయన్మార్ ఈ విపత్తుకు తీవ్రంగా ప్రభావితమైంది. మృతుల సంఖ్య కూడా అక్కడ భారీగానే ఉంది. తాజా సమాచారం ప్రకారం రెండు దేశాల్లో భూకంపం కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 1,000 దాటింది. మయన్మార్‌లో కనీసం 1002 మంది మరణించినట్లు మయన్మార్ మిలిటరీ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. మరో, 2376 మంది గాయపడినట్లు పేర్కొన్నారు. శిథిలాల కింద వందల మంది చిక్కుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర సహాయ చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. శిథిలాల తొలగింపు తరవాత మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. బ్యాంకాక్ లో 10 మంది మరణించగా.. ఓ భారీ భవంతి కూలిన ఘటనలో దాదాపు 100 మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. అయితే రెండు దేశాల్లో మరణాల సంఖ్య 10 వేలు దాటే అవకాశం ఉన్నదని అమెరికా ఏజెన్సీ అంచనావేసింది. భూకంపం కారంణంగా కూలిన 30 అంతస్థుల భవంతి కింద మరో 43 మంది చిక్కుకుపోయారు. వీరిని వెలికి తీసేందుకు సహాయకచర్యలు జరుగుతున్నాయి. అయితే మయన్మార్‌లో భూకంపం సంభవించిన వెంటనే ప్రధాన నరేంద్ర మోదీ ఆ దేశాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే భారత్ నుంచి ఆ దేశానికి సహాయపు సామాగ్రిని విమానంలో పంపించారు.



భూవిలయంతో వణికిపోయిన మయన్మార్‌ను తాజాగా మరిన్ని ప్రకంపనలు కలవరపెడుతున్నాయి. శుక్రవారం అత్యంత తీవ్రతతో పలుసార్లు కంపించగా.. శనివారం కూడా ప్రకంపనలు వస్తున్నాయి. ఉదయం 11.53 సమయంలో 4.3తీవ్రతతో భూమి కంపించింది. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత 3.8 తీవ్రతతో ఒకసారి, తాజాగా 2.50 గంటల సమయంలో 4.7 తీవ్రతతో మరోసారి ప్రకంపనలు వచ్చినట్లు- భారత్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ వెల్లడించింది. భూకంప బాధిత దేశాన్ని ఆదుకునేందుకు అంతర్జాతీయ సమాజం తమవంతు సాయాన్ని పంపిస్తున్న సమయంలో తాజా ప్రకంపనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మయన్మార్‌లోని ఓ ప్రాంతంలో భూకంపం తర్వాత భూమిలో నుంచి నీళ్లు ఉబికి వస్తుండటం విస్మయానికి గురిచేసింది. ఒక్కోసారి వందల అడుగులు బోరు వేసినా దొరకని నీళ్లు భూకంపం దెబ్బకు పొంగుకుంటూ వస్తున్నాయని ఈ వీడియో చూసిన వాళ్లంతా నోరెళ్లబెట్టారు. అయితే.. భూకంపం వల్ల వాటర్ లైన్స్ పగిలిపోయి ఇలా అయి ఉండొచ్చని.. అంతేతప్ప ఇవి భూమి లోపల నుంచి వస్తున్న నీళ్లు కావని ఎక్కువ మంది నెటిజన్లు అభిప్రాయపడ్డారు. భూ ఫలకాల్లో మార్పులు సంభవించినప్పుడల్లా భూకంపాలు సంభవిస్తుంటాయి. నేపాల్,
టిబెట్, భూటాన్, చైనాలోని ఎత్తైన ప్రాంతాలపై దీని ప్రభావం ఉంటుంది. భవిష్యత్‌లోనూ భూకంప ప్రమాదాలు పొంచి ఉన్నాయని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. పలుచోట్ల ఎత్తైన ఆలయాలు, గోపురాలు కుప్పకూలాయి. మండాలెలో ఇర్రవడ్డీ నదిపై ఉన్న అతి పురాతన అవా బ్రిడ్జి కూలిపోయింది. ప్రకృతి విలయంతో వణికిన మయన్మార్, థాయ్‌లాండ్‌లను ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ముందుకొస్తున్నాయి. ఇప్పటికే భారత్.. 'ఆపరేషన్ బ్రహ్మ' కింద మయన్మార్‌కు 40 టన్నుల సహాయక సామగ్రిని పంపించింది. టెంట్లు, దుప్పట్లు-, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు ఆహార ప్యాకెట్లను అందించింది. 80 మంది ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని కూడా పంపించింది. అటు-అమెరికా, ఇండోనేషియా, చైనాలు కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి.

## ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి: ఎమ్మెల్యే జిఎంఆర్

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

కొత్తకోట, మార్చి 29(ప్రభాత ఉదయం) ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట మండల కేంద్రంలో గల పెద్ద మసీదు లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరుపున పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.









కాలేజీ డే లో పాల్గొన్న బిగ్ బాస్ షో ఫేమ్ అవినాష్.. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

## ఘనంగా రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల కాలేజీ డే

బుద్వేల్, మార్చి29(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల లో శనివారం కాలేజీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో బిగ్ బాస్ ఫేమ్ కల్ల అవినాష్ ముఖ్య అతిథిగా హాజరైనారు. వర్శిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్శిటీ డీన్ అగ్రికల్చర్ డాక్టర్ ఝాన్సీరాణి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ కె.బి ఈశ్వరీ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్, పూర్వ అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్ రెడ్డి, కళాశాల ఓఎస్ఏ డాక్టర్ ప్రశాంత్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిగ్బాస్ ఫేమ్ కల్ల అవినాష్ మాట్లాడుతూ, పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే జీవితంలో మనం అనుకున్న లక్ష్యాలను సాదిస్తామన్నారు. పలువురిని అనుకరిస్తు మిమిక్రీ చేస్తు విద్యార్థులను అలరించారు. తాను నటనలో రాణించడానికి పడిన కష్టాలను ఈ సందర్భం గా పంచుకున్నారు.

## రెండురోజుల్లో రైతు భరోసా నిధులు జమ

మొదటి పేజీ తరువాయి...

నిధులు మరో రెండు రోజుల్లో జమ అవుతాయని చెప్పారు. ఉగాది రోజున ఖమ్మం జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు- మంత్రి చెప్పారు. కొత్తగూడెం పట్టణంలో ఎయిర్ పోర్టు నిర్మించాలని కేంద్రమంత్రిని కలిసి కోరటం జరిగిందని, ఈ ప్రాంతంలో ఎయిర్ పోర్టు ఏర్పాటు- చేస్తే దక్షిణ అయోధ్య గా భాసిల్లుతున్న భద్రాచలం దివ్య క్షేత్రం మరింత ప్రాచుర్యం పెరుగుతుందన్నారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, ఆదిలాబాద్ మీదుగా జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. యాదాద్రి భద్రాద్రి జాతీయ రహదారి వల్ల గోదావరి పరివాహక ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.





నేతాజీ నగర్ పాఠశాలలో నిర్వహించిన పోటీలలో పాల్గొన్న చిన్నారి.. రాజేంద్రనగర్‌లోని హరి హర క్షేత్రం

## ఉగాది వేడుకల సందర్భంగా పోటీలు

బుద్వేల్, మార్చి29(ప్రభాత ఉదయం) : ఉగాధి పర్వదినం సందర్భంగా శనివారం శ్రీరాంనగర్, నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలలో నవ యువ యువజన సంఘం ఆధ్వర్యం లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలక్రిష్ణ పాల్గొని విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలందరికి మేలు జరగాలని భగవంతున్ని కోరుకుంటున్నామన్నారు. నవ యువ యువజన సంఘం అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామి మాట్లాడుతూ. విద్యార్థులలో సృజనాత్మకతను, భాషా ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొంపల్లి జగదీశ్, మానవ సేవే మాధవ సేవ సంస్థ డైరెక్టర్ హేమలత, గోంత్యాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మీ, యాదమ్మ పాల్గొన్నారు.

### ఉగాది పర్వదినానికి ముస్తాబైన దేవాలయాలు

విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి రాజేం ద్రనగర్ సర్కిల్ లోని దేవాలయాలు ముస్తాబైనాయి. రాజేంద్రనగర్ లోని హరి హర క్షేత్రం, బుద్వేల్ శ్రీ శివాంజనేయ స్వామీ దేవాలయం, రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయం, ఎర్రబోడ సప్తగిరి వెంకటేశ్వర స్వామీ దేవాలయం. రాంబాగ్ శ్రీ రామచంద్రస్వాముల దేవాలయం, ప్రగతి కాలనీ శ్రీ పంచాయతన శక్తిపీఠం. కాటేదాన్ హనుమాన్ దేవాలయాలలో ఉగాధి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## ప్రజలందరికి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు

### టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, మార్చి 29 (ప్రభాత ఉదయం) ఉగాది పర్వదినం శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అన్నీ శుభాలు జరగాలని, ప్రజలందరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని టీపీసీసీ అధికార ప్రతినిది డాక్టర్ సత్యం శ్రీరంగం ఆకాక్షించారు. షడ్రుచుల సమ్మేళనమయిన ఉగాది పచ్చడి మన సంస్కృతీ, సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ఆహారపు అలవాట్లకు అద్దం పడుతుంది అన్నారు. ఈ నూతన తెలుగు సంవత్సరంలో ప్రతీ ఒక్కరి జీవితం కొత్త ఆశలు, ఆశయాలు, ఆలోచనలతో నవ వసంతం ఆనందమయం కావాలని ఆశిస్తూ, ప్రజలందరికి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వం లక్ష్యమని, ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తుందని, భవిషత్యులో పేద ప్రజలందరికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు.

## బీసీ బిల్లుల స్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి...

ఉన్న బీజేపీ ప్రభుత్వం తగిన ఒత్తిడి తేవాలని కవిత కోరారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52%గా తేలిందని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కులసర్వేలో బీసీల జనాభా తగ్గించి, ఓసీల జనాభా పెంచినట్లు ఆమె ఆరోపించారు. ప్రభుత్వం గ్రామాల వారీగా, కులాల వారీగా జనాభా లెక్కలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎంబీసీ కులాలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటి వరకు దానిని అమలు చేయలేదని కవిత విమర్శించారు. బీసీల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ నివేదికను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఘనంగా తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




ఉప్పర్ పల్లి పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ జెండా ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేస్తున్న సామ భూపాల్ రెడ్డి



హైదర్ గూడ చౌరస్తాలో పార్టీ జెండా ఎగురవేస్తున్న మ్యాడం రామేశ్వర్ రావు

బుద్వేల్, మార్చి29(ప్రభాత ఉదయం) : తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాతనే ఉమ్మడి ఆం ధ్రప్రదేశ్ లో పేదలు, మధ్య తరగతి ప్రజలు, ఎస్సీ, ఎస్టీలు, బీసీలకు అన్ని రంగాలలో మేలు జరిగిందని టీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్పల్లిలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసిందన్నారు. హైటెక్ సిటీ రూపకల్పన తెలుగుదేశం ప్రభుత్వం హయంలోనే జరిగిందన్నారు.

**రాబోయే కాలంలో తెలంగాణ లో అధికారంలోకి వచ్చేది కూటమి ప్రభుత్వమే : మ్యాడం రామేశ్వర్ రావు:**

1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పార్టీ ద్వారా సేవా కార్యక్రమాలు, ప్రభుత్వం ద్వారా పాలన వ్యవహారాలు నడిపారని గుర్తు చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు అద్వర్యంలో నగరంలో హైటెక్ సిటీ రూపకల్పన జరిగి నేడు అనేక మందికి ఉపాధి అవకాశాలు కలిగాయన్నారు. భవిష్యత్ లో తెలం గాణలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సుపరిపాలన, జవాబుదారితనం, అభివృద్ధి తెలుగుదేశం ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.క్రిష్ణారెడ్డి, సోమారం రాజ్ కుమార్ , చంద్రశేఖర్ రెడ్డి, అగిశెట్టి బాల్ రాజ్, నాగులపల్లి వెంకటేశ్, ఎం.జయవంత్ రావు , విజయలక్ష్మి, కె.కొండారెడ్డి, ఆర్ బాలప్ప, చంద్రశేఖర్, ఆంజనేయులు గౌడ్. ఎండీ అజం, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేయనున్న ప్రభాకర్ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న రిజిస్టర్ డాక్టర్ విద్యాసాగర్

## ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతలతో పని చేస్తేనే సంస్థలు మంచి పురోగతి

### విశ్వవిద్యాలయం రిజిస్టార్ డాక్టర్ విద్యాసాగర్

రాజేంద్రనగర్, మార్చి 29(ప్రభాత ఉదయం) ప్రతి ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతలతో పని చేస్తేనే సంస్థలు మంచి పురోగతిలో పయనిస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి ఈ సి హెచ్ విద్యాసాగర్ అన్నారు. వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితం మధ్య సమన్వయం పాటిస్తూ బాధ్యతలు నిర్వర్తించాలని ఆయన అన్నారు. విశ్వవిద్యాలయంలో 29 సంవత్సరాల 6 నెలలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఈనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్న సూపరిన్ టెన్ డెంట్ జె ప్రభాకర్ రెడ్డి సన్మాన కార్యక్రమం శనివారం పరిపాలన భవనంలో జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రభాకర్ రెడ్డిని సత్కరించారు. ఆయన ఇన్నాళ్లుగా విశ్వవిద్యాలయానికి అందించిన సేవల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది, ఔట్సోర్సింగ్ సిబ్బంది, ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రభాకర్ రెడ్డి విశ్రాంత జీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.




కె రవికుమార్

## రోడ్లపై వాల్ పోస్టర్లను అతికిస్తే కేసులు పెడతాం

### డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

బుద్వేల్, మార్చి29 (ప్రభాత ఉదయం) గోడలపై వాలోపోస్టర్ లు అతికిస్తే జరిమాన తో పాటు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ లో జరిగిన ఆస్తి పన్ను పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆస్తి పన్ను పరిష్కార వేధికలో ఇంటి పన్నులు ఎక్కువ తక్కువ ఉంటే ఫిర్యాదు చేసిన వారి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు.

**జీహెచ్ఎంసీ ఆస్తులపై వాల్ పోస్టర్లను అతికించవద్దు**

పీవీ నర్సింహ్మారావు ఎక్స్ ప్రెస్ వే తో పాటు అరాంఘర్ అండర్ పాస్, ఓల్డ్ కర్నూల్ రోడ్డు లోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో ఉన్న గోడలపై వాల్ పోస్టర్లను అతికించవద్దని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. వివిధ రకాల డ్రాయింగ్ వేసి నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడానికి జీహెచ్ఎంసీ ప్రయత్నిస్తుండగా జిహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఆస్తులపై వాల్ పోస్టర్లను అతికిస్తు పాడు చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామన్నారు. అవసరమైతే పోలీసు కేసులు కూడా పెడతామని హెచ్చరించారు.

**సెలవు దినాలలో కూడా ఆస్తి పన్ను చెల్లించవచ్చు :**

రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు ఆస్తి పన్ను లు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధిలో బాగస్వామ లు కావాలని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. సెలవు దినాలు, పండుగ దినాలలో కూడా రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్నును తీసుకోవడం జరుగుతుం దన్నారు. ఆదివారం కూడా కార్యాలయంలో ఆస్తి పన్ను ను తీసుకుంటారన్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు దృష్టిలో ఉంచుకుని ఆస్తి పన్ను చెల్లించాలన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ కు రూ. 54కోట్ల ఆస్తి పన్ను వసూలు టార్గెట్ ఉ ండగా, ఇప్పటి వరకు రూ.49 కోట్లను వసూలు చేయడం జరిగిందన్నారు.




రాజేంద్ర నగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా శనివారం భాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం గోవర్ధన్

## వ్యవసాయ కళాశాల అసోసిమేట్ డీన్‌గా డాక్టర్ మంతటి గోవర్ధన్

రాజేంద్రనగర్, మార్చి 29(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలు అపోసియేట్ డీన్ గా డాక్టర్ మంతటి గోవర్ధన్ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు విశ్వవిద్యాలయు వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ అల్లాక్ జానయ్య నియమించారు. డాక్టర్ గోవర్ధన్ 1985-89 బ్యాచ్ పూర్వ విధ్యార్థి కావడం విశేషం. శాస్త్రవేత్త గా 05000 కుసుమ, ఆముదము , గోధుమ పంటలపై విరివిగా పరిశోధనలు చేపట్టారు. కంపాసాగర్ పరిశోధిన స్థానం ఏర్పాటుతో కీలక పాత్ర పోషించి, ఆయకట్టు రైతులకు లబ్ధిదాయక పంటలపై, మెట్టవరిపై, దుక్కి అవసరం లేని మొక్కజొన్న పంటపై విపులంగా పరిశోధనలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని, పంటలకు బదులుగా సమగ్ర వ్యవసాయం చేపట్టాలని ప్రతి జిల్లాకు నమూనాలను తయారు చేశారు. చిన్న సన్న కారు రైతుల కల నాబార్డు బ్యాంకు ద్వారా పది లక్షల రూపాయలు అప్పుగా ఆ యివ్వాలని 'బ్యాంకువారి ఆదేశాలకు యిప్పించారు. రైతు కుటుంబ నేపథ్యం, దేశంలో మంచి పేరున్న దేశంలో పేరుగాంచిన వ్యవసాయ కళాశాల కు అసోసిమేట్ డీన్ గా నియమించడం విశ్వ విద్యాలయానికి ఎంతో మేలు. ఈ సందర్భంగా డాక్టర్ గోవర్ధన్ మాట్లాడుతూ... వ్యవసాయ కళాశాల ఉన్నతికి ఉన్నతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానన్నారు.




మైలార్ దేవుపల్లి జలమండలి సెక్షన్ ఆఫీస్ వద్ద ఇంకుడు గుంతను పునరుద్ధరిస్తున్న అధికారులు

## ప్రతి ఇంటి వద్ద, కార్యాలయంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి

బుద్వేల్, మార్చి29 (ప్రభాత ఉదయం): ప్రపంచ నీటి వారోత్సవాలలో బాగంగా శనివారం మైలార్దేవుపల్లి జలమండలి సెక్షన్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఇంకుడు గుంతను అధికారులు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రేణుక మాట్లాడుతూ, వర్షం నీటి బొట్టును భూమిలోకి ఇంకించాల్సిన అవసరం ఉందన్నారు. వృదాగా రోడ్లపై పారే నీటిని కూడా భూగర్భంలోకి ఇంకేటట్లు చూడాలన్నారు. అందుకోసం ప్రతి ఇంటి వద్ద, కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది జియావుద్దీన్, గోపాల్ రావు, ప్రసాద్, రఘునాయక్, ఇంతియాజ్, పృథ్వీ, పుష్పగిరి రూరల్ డెవలప్మెంట్ సోసైటీ నిర్వాహకురాలు బి.పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.




మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి కార్తీక్ రెడ్డిలకు జయంతి ఉత్సవాల బ్రోచర్ లను ఇచ్చి ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

## మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బుద్వేల్, మార్చి29(ప్రభాత ఉదయం): దేశానికి దిశ దశ చూపిన మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి నిర్వాహకులకు సూచిం చారు. ఏప్రిల్ మాసంలో రాజేంద్రనగర్ సర్కిల్ లో నిర్వహించనున్న మహనీయుల జయంతి వేడుకలకు రావాలని కోరుతు జయంతి ఉత్సవాల కమిటీ ప్రతనిధులు శనివారం పి. సబితా ఇం ద్రారెడ్డి తో పాటు ఆమె తనయుడు బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జ్ పి. కార్తీక్ రెడ్డిలకు ఆహ్యాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేం ద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీక్ రెడ్డి లు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ సర్కిల్ లో మహనీయుల జయంతి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఉత్సవాల కమిటీ అధ్యక్షులు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్. కోశాధికారి మం గళారం శ్రీనివాస్ లు మాట్లాడుతూ. ఏప్రిల్ 5వ తేదీన ఆరాంఘర్ బాబు జగ్జీవన్ం చౌరస్తా, 14వ తేదీన రాజేంద్రనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలలో నిర్వహించనున్న భారత మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగవ్రాం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.జీవన్ దాస్, గోల్కొండ రాజు, పంబాల రాజు, గడ్డం సామేల్, పచ్చ శ్రీనివాసులు, ఆదిరాల రవికుమార్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



పూలే జయంతి ఉత్సవాల కమిటీ నాయకులు

## పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం : బండారి శంకర్

బుద్వేల్, మార్చి29(ప్రభాత ఉదయం) : ఏప్రిల్ 11వ తేదీన రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జయంతి ఉత్సవాల నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు, గుడి మల్కాపూర్ పూలమార్కెట్ కమిటీ సభ్యుడు బండారి శంకర్ తెలిపారు. శనివారం పూలే జయంతి ఉత్సవాల కమిటీ నాయకులతో కలసి రాజేంద్రనగర్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారి శంకర్ మాట్లాడుతూ, రెండు రోజుల్లో పూలే జయంతి ఉత్సవాల బ్రోచర్ న్ను అవిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పూలే జయంతి ఉత్సవాల కు హాజరు కావాలన్నారు.

## కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు

### ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి



కూకట్‌పల్లి, మార్చి 29 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రజానీకానికి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, అభిమానులకు శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు ప్రజల ఉగాది పండగ, తెలుగు ప్రజల నూతన సంవత్సరం వేడుకలు ప్రారంభంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉండాలని, దినదినం అభివృధి చెందుతూ మంచి మార్గములో నడుచుకుంటూ పది మందికి ఉపయోగ పడేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉగాది పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి మరింత ముందుకు దూసుకు పోయేందుకు కార్యక్రమాలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.








## శివరాంపల్లిలో ఇఫ్తార్ విందు

బుద్వేల్, మార్చి 29(ప్రభాత ఉదయం) : శివరాంపల్లి ప్రిన్స్ ప్యాలెస్ లో శనివారం సాయంత్రం మజ్లిస్ నాయకులు సయ్యద్ వాజిద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ విందులో శాసనమండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్, మజ్లిస్ నాయకులు నవాజుద్దీన్, మహ్మద్ మూర్తుజా అలీ తదితరులు పాల్గోన్నారు.



## కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత యువతి ఆత్మహత్య



పింకీ శర్మ

బుద్వేల్, మార్చి29 (ప్రభాత ఉదయం) కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత యువతి ఇంట్లో ప్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... రాజస్థాన్ కు చెందిన అమిష్(35) అత్తాపూర్ హుడా కాలనీ తీన్ గుండు ప్రాంతంలో నివాసం ఉంటాడు. పెళ్లయి విడాకులు అయిన తర్వాత హుడా కాలనీలోనే నివాసం ఉంటున్న రాజస్థాన్ కు చెందిన పింకి శర్మ(30) తో సంవత్సరం క్రితం అమిష్ కు వివాహం జరిగింది. అమిష్ స్టాక్ మార్కెట్ బ్రోకర్ గా పనిచేస్తుంటాడు. పింకి శర్మ మెహిందీ వేస్తు బ్యూటీ పార్లర్గా పనిచేస్తుంది. గత కొం త కాలంగా అమిష్ స్టాక్ మార్కెట్ లో డబ్బులు పెట్టి నష్టపోయాడు. ఈ విషయంలో భార్య భర లిద్దరు వారం రోజులుగా గొడవ పడుతున్నారు. శుక్రవారం కూడా భార్యభర్తలిద్దరు గొడవ పడ్డారు. దీంతో పింకి శర్మ శుక్రవారం రాత్రి తాము ఆద్దెకుంటున్న ప్రాంతంలో క్రింది పోర్టన్ లో ఉండే ఇంటి యజమాని ఇంట్లో ఉండిపోయింది. భర్త అమిష్ బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 1.30 గంటలకు పింకి శర్మ పై అంతసులో ఉండే తమ ఇంటికి వెళ్లి పోయింది. రెండు గంటల తర్వాత భర్త ఇంటికి వచ్చాడు. లోపలికి వెళ్లి చూడగా భార్య పింకి శర్మ ఇంట్లోని ప్యానుకు చున్నితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. అమిష్ పక్కింటి వారి సహకారంతో మృతదేహాన్ని క్రిందికి దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించిందని డాక్టర్లు దృ వీకరించారు. సమాచారం తెలుసుకున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితులను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మారం నిమిత్తం ఉస్మానియా మార్చ్యురికి తరలించిన పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక



# ఘనంగా రెయిన్ బో పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

కూకట్‌పల్లి, మార్చి 29 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని రెయిన్బో పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం రెడ్డి సంక్షేమ సంఘం లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల చిన్నారులు చేపట్టిన పలు కార్యక్రమాలను తిలకించిన వారు విద్యార్థుల కు ప్రశంసా పాత్రలను అందిస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమానికి హాజరైన అతిధులను పాఠశాల నిర్వాహకులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# చెన్నూరు జమా మసీదులో ఇఫ్తార్ విందు, హాజరైన సీఐలు

చెన్నూర్, మార్చి 29. (ప్రభాత ఉదయం) : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చెన్నూరు పట్టణంలోని జమా మసీదులో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా, చెన్నూరు టౌన్ సిఐ దేవేందర్ రావు, చెన్నూరు రూరల్ సిఐ సుధాకర్ లు హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం రంజాన్ మాసం పవిత్రతను గురించి మాట్లాడుతూ, అల్లాహ్ ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. ఉపవాస దీక్షలు ప్రజల్లో క్రమశిక్షణను పెంపొందిస్తున్నాయన్నారు. అందరూ కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. అనంతరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో సిఐ లను సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఖాజా ఖంరొద్దీన్, ఇమామ్ సర్ఫరాజ్, మౌజన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.




పదవి విరమణ చేసిన డిప్యూటీ తాసిల్దార్ బక్షి శ్రీకాంత్ రావును సన్మానిస్తున్న మాజీ జెడ్పిటిసి విశ్వేశ్వర్

# జిల్లా కలెక్టర్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ భక్షి శ్రీకాంత్ రావు సేవలు అమోఘం

## పదవి విరమణ పొందిన భక్షి శ్రీకాంత్ రావు సన్మానించి..వారి సేవలను కొనియాడీ అభినందించిన మాజీ జడ్పిటీసి పొగాకు విశ్వేశ్వర్

వనపర్తి జిల్లా ప్రతినిధి, మార్చి29(ప్రభాత ఉదయం): వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ గా కొత్తకోటకు చెందిన భక్షి శ్రీధర్ రావు సేవలు అమోఘమని కొత్తకోట మండల మాజీ జెడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర అన్నారు. శనివారం భక్షి శ్రీధర్ రావు పదవీ విరమణ సందర్భంగా మాజీ జెడ్పిటిసి విశ్వేశ్వర్ మానించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ మాట్లాడుతూ..భక్షి శ్రీధర్ రావు ఉద్యోగంలో చేరక ముందు ఈనాడు జర్నలిస్ట్ గా పనిచేసి ఆనాడు పేద ప్రజల సమస్యలు పరిష్కరించి సేవలు అందించారన్నారు.అదే మాదిరిగా జిల్లా కలెక్టర్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ గా పని చేస్తూ..వనపర్తి జిల్లా ప్రజలకు సేవలు అందించి ఈరోజు పదవి విరమణ పొందడం అభినందనీయమని కొత్తకోట మాజీ జడ్పిటీసి పొగాకు విశ్వశ్వర్ అన్నారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో..జిల్లా కలెక్టర్ కార్యాలయంలో..జిల్లా కలెక్టర్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ భక్షి శ్రీకాంత్ రావు పదవి కార్యక్రమం జరుగగా మాజీ జడ్పిటీసి పొగాకు విశ్వశ్వర్ , బి ఆర్ ఎస్ నేత లక్ష్మన్న గారి రవీందర్ రెడ్డిలు పాల్గొని నాయబ్ తహసీల్దార్ భక్షి శ్రీకాంత్ రావు కి శాలువతో సన్మానం చేసి వారి సేవలను కొనియాడీ అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవి విరమణ ఉద్యోగానికి మాత్రమేనని..సేవలకు కాదని రెవిన్యూ డిపార్ట్ మెంట్లో ఉన్న అనుభవంతో..పత్రిక రంగంలో సీనియర్ జర్నలిస్ట్ గా ఉన్న అనుభవంతో భక్షి శ్రీకాంత్ రావు ప్రజల పక్షాన నిలుస్తూ..రేపటి నుండి సేవలు అందించాలని మాజీ జడ్పిటీసి పొగాకు విశ్వశ్వర్ పదవి విరమణ పొందిన భక్షి శ్రీకాంత్ రావు కోరారు.

# జలమండలిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ బృందం

హైదరాబాద్, మార్చి 29(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్ కి చెందిన ఏడుగురితో కూడిన ట్రైనీ ఐఏఎస్ బృందం జలమండలిని సందర్శించింది. ఒకరోజు ఒరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో భాగంగా బుధవారం ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయానికి విచ్చేసి జలమండలి కార్యకలాపాల గురించి వారు తెలుసుకున్నారు. ఎండీ అశోక్ రెడ్డి .. బోర్డు పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్టీపీలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు.. భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. కోటి 30 లక్షలకు పైగా జనాభా ఉన్న హైదరాబాద్ మహా నగరానికి భారీ పైపు లైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న పద్ధతిని తెలిపారు. దీంతో పాటు నీటి శుద్ధి, వివిధ దశలలో నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియ, క్లోరినేషన్, తుది దశగా హైదరాబాద్ కు భారీ మోటర్లతో పంపింగ్ వంటి అంశాల గురించి వివరించారు. నగర ప్రజలకు సుదూర ప్రాంతాల నుంచి సరఫరా చేసే విలువైన నీటిని వృథా చేయకుండా జలమండలి ఎప్పటికప్పుడు చేపట్టే అవగాహన కార్యక్రమాల్ని వివరించారు. వాన నీటి సంరక్షణ పద్ధతులను వివరించే థీమ్ పార్కును జలమండలి నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ థీమ్ పార్కులో భవిష్యత్తు తరాలకు వాన నీటిని ఎలా ఒడిసి పట్టాలో తెలిపే వివిధ పద్ధతుల్ని ఉన్నట్లు వివరించారు. వీటితో పాటు రాబోయే 25 ఏళ్లలో చేపట్టే భవిష్యత్తు కార్యాచరణ గురించి కూడా తెలిపారు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్.. సమ్మర్ ఆక్షన్ ప్లాన్ లతో వేసవిలో హైదరాబాద్ నగరంలో తాగునీటి ట్యాంకర్ బుకింగ్ సరళి.. డెలివరీ వివరాలతో పాటు గత ఏడాదికంటే 60 శాతం పెరిగినా 98 శాతం ట్యాంకర్లను 24 గంటల్లో డెలివరీ చేస్తున్నట్టు వివరించారు. అలాగే జలమండలి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ–హైదరాబాద్ స్పెషల్ డ్రైవ్" కార్యక్రమం గురించి వివరించారు.. జలమండలి పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సిబ్బంది, అధికారులు సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలో



పూడికతీత పనులు రోజూ చేపడుతున్నారని అన్నారు. ఒకవైపు రోజూ వారీగా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుకుంటూనే.. మరోవైపు స్పెషల్ డ్రైవ్ కు సంబంధించిన పనులు చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రోగ్రామ్ లో ఇప్పటిదాకా 24,001 ప్రాంతాల్లో పనులు నిర్వహించారని, అందులో 3,156 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్, 248.1 లక్షల మ్యాన్ హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారని వివరించారు. అలాగే ఈ కార్యక్రమం చేపడంవల్ల ఎంసీసీ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు తగ్గినట్టు ఈడీ చెప్పారు. ఈఎన్ సి అండ్ డైరెక్టర్ ఆపరేషన్ -2 వీఎల్ ప్రవీణ్ కుమార్.. జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ, ఐటీతో పాటు.. ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్- 1, 2 ప్రాజెక్టులు, వంద శాతం మురుగుశుద్ధి కోసం చేసే ఎస్టీపీల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఆపరేషన్స్-1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సిజిఎం (పి అండ్ ఏ) మహ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# జిఎంఆర్ గోల్డ్ కప్



క్రీడల్లో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



బ్యాట్ పట్టి క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎం ఆర్

## టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, మార్చి 29(ప్రభాత ఉదయం) కొత్తకోట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిఎంఆర్ గోల్డ్ కప్(క్రికెట్ టోర్నమెంట్) కొత్తకోట మండలం ప్రీమియర్ లీగ్ (కే ఎం పి ఎల్) ఆద్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను క్రీడాకారులను దేవరకద్ర నియోజకవర్గం శాసన సభ్యులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఉమ్మడి జిల్లా సిడిసి చైర్మన్ స్వర్గీయ పాపయ్య చంద్రశేఖర్ రెడ్డి (గోల్లబాబు) చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ లు ,కాంగ్రెస్ పార్టీ జిల్లా , మండల, టౌన్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

# ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

## ధాన్యం కొనుగోలు లో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తాం: ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, మార్చి 29(ప్రభాత ఉదయం) అన్నదాతలు పండించిన పంటకు గిట్టుబాటు ధర ప్రధాన వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. శనివారం కొత్తకోట మండల కేంద్రంలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ను కలిసి మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్ర ఏర్పాటుపై వేముల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జిఎంఆర్ కి వినతిపత్రం అందజేశారు. కొత్తకోట మండలంలో యాసంగి వరి ధాన్యం కోతలు మొదలైన సందర్భంగా రైతులకు ఇబ్బందులు లేకుండా తొందర్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. ధాన్యం సేకరణలో పారదర్శకంగా పాటించి రైతులందరికీ మద్దతు ధర అందేలా చర్యలు తీసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.



# మనస్థాపంతో యువతి ఆత్మహత్యాయత్నం

## ఆర్మీ జవాను అడ్డదారులు వరకట్న వేధింపులు, భర్త మరో యువతితో అక్రమ సంబంధం న్యాయం చేయాలంటూ యువతి కుటుంబసభ్యుల వేడుకోలు

చెన్నూర్, మార్చి 29. (ప్రభాత ఉదయం) : ఆర్మీ జవానుతో ప్రేమ పెళ్లి, కొద్ది రోజులకే మరో యువతితో భర్త అక్రమ సంబంధం కొనసాగించడంతో పాటు వరకట్నం కోసం భర్త, అత్తింటి వేధింపులు తాళలేక నవ వధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అమానవీయ ఘటన చెన్నూరులో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, చెన్నూరు పట్టణం నల్లగొండ పోచమ్మ వాడ మాదిగ సామజిక వర్గానికి చెందిన సత్య(24)అనే యువతి బేతాల వాడలోని మాల సామజిక వర్గానికి చెందిన నూకల మహేష్ అనే ఆర్మీ జవానును గత సంవత్సరం ప్రేమించి పెళ్లి చేసుకుందని, పెళ్ళైన కొన్నాళ్ళకే సత్యను భర్త అతని తల్లి వరకట్నం కోసం వేధించే వారని, వరకట్నం ఎలాగో ఇవ్వలేదని భావించిన భర్త గత కొద్ది రోజులుగా మరో యువతితో వేరు కాపురం పెట్టాడని, న్యాయం చేయాలని సత్య చెన్నూరు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా, ఆమెపై భర్త మహేష్, అత్తింటి వారు దాడికి పాల్పడడంతో మనస్థాపం చెందిన సత్య హెయిర్ డై సేవించి ఆత్మహత్యా యత్నం చేసిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చుట్టు పక్కల వారి సమాచారం మేరకు సత్యను హుటాహుటిన చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, సత్య భర్త మహేష్ అతని కుటుంబ సభ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకొని, సత్యకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608